

జిల్లాలో నాటుసారా పూర్తి స్థాయిలో నిర్మూలన

ప్రజాశక్తి -కడప

జిల్లాలో నాటు సారాను పూర్తి స్థాయిలో నిర్మూలించామని జెసి అదితి సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని బిసి హాలులో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనా కార్యక్రమం 'నవోదయం 2.0' పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేశారన్నారు. జిల్లాలో నాటు సారా తయారీ పూర్తిగా నిర్మూలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు ఆమె అభినందనలు తెలియజేశారు. నాటు సారా రహిత జిల్లాగా మారడం ఎంతో సంతోషంగా ఉందని భవిష్యత్తులో జిల్లాలో ఎక్కడా నాటుసారా తయారీ, అమ్మకాలు గానీ, ఎటువంటి కేసులు గానీ నమోదు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు.

గండికోట అదనపు లిఫ్ట్ పనుల్లో కదలిక



రూ.2,601 కోట్ల పనులకు కసరత్తు
లక్ష ఎకరాల స్థిరీకరణకు ఛాన్స్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు గండికోట నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూగర్భ టన్నెల్ పనుల్లో కదలిక వచ్చింది. ప్రభుత్వం జిఒఆర్‌టి 441 నెంబరును జారీ చేసింది. 2020 మార్చిలో అప్పటి వైసిపి సర్కారు రూ.2,601 కోట్లతో అదనపు ఎత్తిపోతల పనులకు నిర్వహించిన టెండరును మేఘా ఇంజినీరింగ్ సంస్థ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఐదేళ్లుగా బిల్లుల చెల్లింపులకు భరోసా లభించని కారణంతో కాంట్రాక్టు సంస్థ పనుల్ని నిలిపేసింది. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధం పేరుతో కొండాపురం మండల కేంద్రంలోని సిబిఆర్ భూగర్భ టన్నెల్ పనుల ప్రదేశాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. కొండాపురం మండల పరిధిలోని గండికోట రిజర్వాయర్ నుంచి చిత్రావతి రిజర్వాయర్ వరకు 33 కిలోమీటర్ల మేర రెండు దశల్లో టన్నెల్ పనులు చేపట్టాల్సి ఉంది. 212 కాంటూరులోని గండికోట రిజర్వాయర్ నుంచి 280 కాంటూరులోని పైడిపాలెం రిజర్వాయర్ మీదుగా టన్నెల్ నిర్మించాల్సి ఉంది. పైడిపాలెం రిజర్వాయర్ నుంచి 300 కాంటూరు పరిధిలోని సిబిఆర్ రిజర్వాయర్‌కు ఎత్తిపోతల ద్వారా నీటిని ఎత్తి పోయాల్సి ఉంది. 33 కిలోమీటర్ల మేరకు భూగర్భ టన్నెల్ పనులు చేపట్టాల్సి ఉంది. మొదటి దశ కింద ఆరు కిలోమీటర్ల మేర గండికోట నుంచి పైడిపాలెం రిజర్వాయర్ వరకు, రెండవ దశ కింద పైడిపాలెం నుంచి చిత్రావతి రిజర్వాయర్ వరకు 27 కిలోమీటర్ల మేర టన్నెల్ పనుల్ని చేపట్టాల్సి ఉంది. కొండాపురం నుంచి సింహాద్రిపురం, తొండూరు మండలాల మీదుగా భూగర్భ టన్నెల్ ద్వారా లింగాల మండల పరిధిలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు టిఎంసిల మేర నీటిని తరలించాల్సి ఉంది. రోజుకు 3000 టిఎంసిల చొప్పున వరద సీజన్‌లోని 40 రోజుల వ్యవధిలో 12 టిఎంసిలను ఎత్తి పోయాల్సి ఉంది. పాత పైప్‌లైన్ ద్వారా మరో 12 టిఎంసిలను కలిపితే 24 టిఎంసిల నీటిని పైడిపాలెం, చిత్రావతి రిజర్వాయర్లకు తరలించాల్సి ఉంది. పైడిపాలెం కింద 47,500 ఎకరాలు, చిత్రావతి కింద 59,400 ఎకరాలు పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలో 20 వేల ఎకరాలు వెరసి 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు గ్రహణం పట్టింది. పులివెందుల నియోజక వర్గంలోని సింహాద్రిపురం, తొండూరు, లింగాల మండలాలతోపాటు సత్యసాయి జిల్లాలోని యల్లనూరు మండలాల పరిధిలోని ఆయకట్టు ఉండడం గమనార్హం. సాధారణ అదనపు పైప్‌లైన్ పనుల చేపట్టడం వల్ల 550 ఎకరాలను సేకరించాల్సి ఉంది. రూ.60 కోట్ల భూసేకరణకు పరిహారం చెల్లించాల్సి ఉంది. ప్రెజర్ భూగర్భ టన్నెల్ పనుల కారణంగా ఒక్క ఎకరం భూసేకరణ, పరిహారం సమస్యలు తలెత్తకుండా ఎత్తిపోతల పనులకు పరిష్కారం లభించనుంది. భూగర్భ టన్నెల్ కారణంగా నాలుగేళ్ల వ్యవధిలో రూ.ఐదు వేల కోట్ల మేరకు ఆదాయం సమకూరనుంది. మూడేళ్ల కింద మేఘా ఇంజినీరింగ్ కాంట్రాక్టు సంస్థ గండికోట రిజర్వాయర్‌కు సమీపంలోని పెద్దకొండ లోపలి భాగంలో 20 మీటర్ల విస్తీర్ణం కలిగిన 33 కిలోమీటర్ల పొడవునా టన్నెల్ తవ్వకపు పనులకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టు పనులకు బిల్లుల చెల్లింపుల్ని తగ్గించిన నేపథ్యంలో సర్వేలు, టెస్టింగుల పేరుతో భూగర్భ టన్నెల్ పనుల్ని నిలిపేసింది. పనుల నిలుపుదలకు, బిల్లుల చెల్లింపులకు సహకరించని నేపథ్యం కనిపిస్తోంది. ఏడాది కిందట అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు గత కేబినెట్ భేటీలో 25 శాతం పనులు పూర్తి చేయని కాంట్రాక్టు పనులను నిలిపేసిన వాటిలో ఒకటైన గండికోట అదనపు లిఫ్టు పనులు చేపట్టడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనిపై ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ శ్రీరామచంద్రమూర్తిని సంప్రదించగా భూగర్భ టన్నెల్ పనులను చేపట్టడానికి ఆమోదం తెలిపిందని పేర్కొనడం గమనార్హం.

సిఎం పర్యటనకు పక్కా ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 1న జమ్మలమడుగు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం జమ్మలమడుగు ఆర్‌డిఒ కార్యాలయ సభా భవనంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ఎస్‌పి అశోక్‌కుమార్, డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పేదలకు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 1న జమ్మలమడుగు నియోజకవర్గ కేంద్రానికి రానున్నారన్నారు. అందులో భాగంగా పెన్షన్ లబ్ధిదారుల కుటుంబాల ఇళ్ళవద్దకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేస్తారన్నారు. పెన్షన్ దారుల కుటుంబ ఆర్థిక స్థితిగతులపై ఇంటరాక్షన్ ఉంటుందన్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే అన్ని కార్యక్రమాలకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పాటించేలా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో కడప నగర కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పర్యటన స్థలాల పరిశీలన.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జమ్మలమడుగు రానున్న సందర్భంగా కలెక్టర్ ఎస్‌పితో కలిసి పర్యటన స్థలాలను పరిశీలించారు. ముందుగా పట్టణంలోని క్యాంబెల్ హాస్పిటల్ సమీపంలోని స్థలాన్ని, అనంతరం పాలిటెక్నికల్ కళాశాల పక్కన గల ప్రదేశాన్ని తర్వాత నానుబాల ఫంక్షన్ హాల్ను, పార్కింగ్ స్థలం కోసం ముద్దనూరు రోడ్డులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పక్కన ఉన్నఖాళీ స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ సభ కోసం ప్రయివేట్ స్థలాన్ని చూశారు. హెలిపాడ్, ఇతర సౌకర్యాలపై అధికారులతో ఆయన చర్చించారు. బహిరంగ సభ వద్ద, హెలిప్యాడ్ వద్ద ఉన్న జంగిల్‌ను తొలగించాలని ఆదేశించారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

జమ్మలమడుగు పర్యటనలో భాగంగా శుక్రవారం దేవగుడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నిర్వాహణ పనులు ఎలా సాగుతున్నాయని అడుగుతూ కిచెన్ నిర్మాణ పనులు చేపడుతున్న ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. రాష్ట్రానికే ఆదర్శంగా జిల్లాలో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ హాళ్లను, జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జి కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక యువ నాయకులు భూపేష్ రెడ్డి, కెఎంసి కమిషనర్, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ రాజరత్నం, ఎపిఎస్‌పిడిసిఎల్, ఆర్డబ్ల్యూఎస్, పీఆర్, ఎస్ఎస్ఎ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నకిలీ పట్టాల తయారీ ముఠా అరెస్టు

గోపవరం తహశీల్దార్ ఫిర్యాదుతో వెలుగులోకి - మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ వెల్లడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేల్ పట్టణంలో నకిలీ పట్టా తయారీ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు.గోపవరం తహశీల్దార్ త్రిభువన్‌రెడ్డి ఫిర్యాదుతో బద్వేల్ అర్బన్ పోలీసులు దర్యాప్తు చేసి చర్యలు చేపట్టారు. మహిళతో సహా పది మందిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం బద్వేల్ అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మైదుకూరు డిఎస్‌పి రాజేంద్ర ప్రసాద్ వివరాలు వెల్లడించారు. బద్వేల్‌లో నకిలీ పట్టాదారుల ముఠా బట్టబయలైందని పేర్కొన్నారు. అర్బన్‌పోలీసులు చేపట్టిన దర్యాప్తులో తీగలాగిఏ డొంక కదినట్లు పట్టాదారు పాస్ పుస్తకాలు, అనుబంధ పత్రాలు క్షణాల్లో ముఠా బృందం ఇట్టే తయారు చేస్తుందన్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. నిత్యం ఎన్నో భూ సమస్యలతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి జాప్యంతో విసిగిపోయే ఫిర్యాదుదారులకు తాము మీ సమస్యలను పరిష్కరిస్తామని నమ్మబలుకుతూ వారి అవసరాన్ని ఆసరాగా తీసుకొని నకిలీ ధృవపత్రాలను తయారుచేసే వారని పేర్కొన్నారు. బద్వేలు నియోజకవర్గంలో ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉండటంతో అక్రమార్కులు ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. ఫిర్యాదులు కూడా ఉండటంతో పూర్తి స్థాయిలో విచారణ చేశామన్నారు. అరెస్టయిన వారిలో దాసరి రత్నమ్మ, పొట్టిపాటి ప్రసాద్, జైపాల్, రామాంజనేయులు, ఓబులేసు, పిల్లి భాస్కర్, మన్యం బాబురావు, బత్తిన రవిశంకర్, చిన్న సుబ్బయ్య, షేక్ బాబ్జాన్, అన్నపురెడ్డి శ్రీనివాసులను అరెస్టు చేశామని చెప్పారు. ఇంకా కొంతమందిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. వీరి వద్దనుండి నకిలీ పాస్ పుస్తకాలు, ఇంటి పట్టాలు, రబ్బరు స్టాంపులు, కలర్ ప్రింటర్ స్టాంపులు, తయారీ యంత్రంతో పాటు మరికొన్ని వస్తువులను వారి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ ముఠాను పట్టుకున్న బద్వేలు పట్టణ సిఐ రాజగోపాల్, బద్వేల్ రూరల్ సిఐ నాగభూషణం, పట్టణ ఎస్ఐలు సత్యనారాయణ, జయరాంరెడ్డి, పోలీస్ సిబ్బందిని అభినందించారు



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ ఎస్ఇ

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ : ఎస్ఇ

ప్రజాశక్తి - ముద్దనూరు

వ్యవసాయానికి, గృహాలకు ఎలాంటి సమస్యలు లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ ఎస్ఇ ఎస్. రమణ సిబ్బందికి సూచించారు. ముద్దనూరు లోని విద్యుత్ ఉప కేంద్రాలు, లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లు శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునికతను ఉపయోగించి వినియోగదారులకు విద్యుత్ సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. కొత్త విద్యుత్ సర్వీసుల్లో జాప్యం ఉండరాదని సూచించారు. గృహ వినియోగదారులకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద గృహాలకు సోలార్ పలకలు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకులు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.98 వేల వరకు సబ్సిడీ అందిస్తుందన్నారు. గృహ వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ సమస్యపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విద్యుత్ అంతరాయాన్ని అరికట్టి ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ట్రాన్సఫార్మర్ వైఫల్యాలు అధికంగా ఉన్నాయన్నారు. వైఫల్యాలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారణకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉంటూ రైతులు, ప్రజల నుంచి వచ్చే ఫోన్లకు స్పందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ రమణారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజగోపాల్, ఎస్ఇ శ్రీనివాసులురెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు కుమార్,యోగానంద రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి-కడప అర్బన్



మాట్లాడుతున్న లక్ష్మీరెడ్డి

వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి మద్యం కుంభ కోణంలో ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సతీష్‌రెడ్డి ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చారని, వేంపల్లిలో వారి కుటుంబానికి మంచి పేరు ఉందని తెలిపారు. రాజకీయ విమర్శలు చేయాలే తప్ప జగన్ మెప్పుకోసం ప్రెస్ మీట్‌లు పెట్టి ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. మద్యం కుంభకోణం ప్రజలందరికీ తెలుసన్నారు. లిక్కర్ షాపుల్లో కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపణలో వాస్తవం లేదని పేర్కొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని
జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి- కడప అర్బన్

బదిలీలు పూర్తయి 3 నెలలు గడుస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల పొజిషన్ ఐడీలు రాకపోవడం, జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు కడప డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. శుక్రవారం యుటిఎఫ్ భవన్ లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలకు ముందు ప్రభుత్వం ఒక ప్రణాళిక బద్ధంగా వ్యవహరించకపోవడం వల్ల బదిలీ పొందిన ఉపాధ్యాయులు రిలీవ్ కావడంలోనూ, పొజిషన్ ఐడిలు క్రియేట్ చేయడంలోనూ, జీతాలు చెల్లించడంలోనూ తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నదని తెలిపారు. బ్యాంకులో తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించే పరిస్థితి వచ్చిందని, నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం వల్ల జీతం మీద ఆధారపడిన ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంటుంద చెప్పారు. ఒకవైపు బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులను దూరంగా పెడతామని ప్రభుత్వం పదేపదే చెబుతూనే పనిభారం విపరీతంగా పెంచి ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేస్తుందని పేర్కొన్నారు. తక్షణమే బోధనేతర కార్యక్రమాలను అన్నింటిని రద్దు చేయాలని చెప్పారు. విద్యాశాఖ వ్యవహరిస్తున్న వింత పోకడలను నిరసిస్తూ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు. నిరసన కార్యక్రమానికి ఎక్కువమంది ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ట్రెజరర్ నరసింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్ పాల్గొన్నారు.

15 నాటికి బంగారు కుటుంబాల
దత్తత పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో పి- 4 అమలు పక్కాగా జరగాలని, ఆగస్టు 15 నాటికి బంగారు కుటుంబాల దత్తత పూర్తి కావాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి పి - 4 మార్గదర్శి, బంగారు కుటుంబాలు దత్తత వంటి అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జెసితో పాటు వివిధ జిల్లా అధికారులు హాజరయ్యారు. విసి అనంతరం జెసి మాట్లాడుతూ జిల్లాలో పి 4 ఐ యామ్ మార్గదర్శి కార్యక్రమం పక్కాగా అమలు జరగాలన్నారు. గ్రామ సభల్లో పీ 4 మార్గదర్శి కార్యక్రమం పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని పరిశ్రమలు, ప్రయివేటు కంపెనీలు సిఎస్ఆర్ ఫండ్‌ని పి 4 కు అనుసంధానం చేసి బంగారు కుటుంబాలను అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు.ముఖ్యమంత్రి సూచనల మేరకు బంగారు కుటుంబాల అవసరాలకు తగ్గట్టుగా షార్ట్ టర్మ్, మీడియం, లాంగ్ టర్మ్ ప్రణాళికల రూపొందించుకొని మార్గదర్శులకు అందజేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తున్న పి 4 అమలుకు అధికారులందరూ శ్రద్ధతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఒ హజరతయ్య, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

సిద్ధవటం తాలూకా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సిద్ధవటం తాలూకా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎపి జిఇఎ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎం.ఏ ప్రసాద్ గౌడ్ వ్యవహరించారు. సిద్ధవటం తాలూకా అధ్యక్షులుగా సి.మురళీకృష్ణ, కార్యదర్శిగా డి.రమణయ్య, కోశాధికారిగా ఎన్. సుబ్బరాయుడు, అసోసియేట్ అధ్యక్షులుగా డాక్టర్ టి.శివకుమార్, ఉపాధ్యక్షులుగా కె. వెంకటేశ్వర్లు, బి.సుబ్రహ్మణ్యం, ఎస్.సాల్మ, ఎన్. వాసవి, ఎం.సుగుణ, సంయుక్త కార్యదర్శులుగా బి.స్రవంతి, బి. నాగ పుష్పలత, బి.శ్రీనివాసులు, ఎం.రాజు నాయక్, ఎస్.కె.మౌలాలి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్.జస్వంత్ ను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారితో ప్రమాణస్వీకారం చేయించారు. వీరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను సాధిస్తామని చెప్పారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు వి. రఘురామ నాయుడు, కార్యదర్శి ఎన్.కృష్ణ ప్రసాద్, బద్వేల్ తాలూకా అధ్యక్షులు సి.హుసేనయ్య, కార్యదర్శి ఎస్.పుష్పరాజు, నగర అధ్యక్షులు సి.నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ పేర్కొన్నారు. శుక్రవారం పాత బస్టాండ్ సమీపంలో నూర్ బాషా, మంత్రి మండలి ఆమోదం తెలపడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలను అభివృద్ధి, సంక్షేమంచ పెట్టు బడులు తద్వారా ఉద్యోగ అవకాశాలు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లె అవుట్లు క్రమ బద్ధికరించి చట్ట సవరణలు, నీటి సరఫరా, నూర్ బాష్ దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రి మండలి లో చచ్చిందని చెప్పారు. దూదేకుల వారిలో పేదరికం ఎక్కువ గా ఉందని, వారు ఆర్థికంగా వెనుకబడి అంతు లేని నిస్సాయత స్థితిలో ఉన్నారని తెలిపారు. టెక్నాలజీతో యంత్రాలు రావడంతో దూది పరుపులు చేత్తో తయారు చేసే విధానం లేకపోవడంతో ఇంకా పేదరికంతో ఉన్నారని పేర్కొన్నారు. వారికి నూరబాష్/ దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ అండగా ఉంటుందని అన్నారు. దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇబ్బందుల్లో ఉన్న వారిని గుర్తించి వారి లోని నైపుణ్యాన్ని గుర్తించి వివిధ రకాల రుణాలు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.



తలపడుతున్న చిత్తూరు, నెల్లూరు జట్లు

మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు ఆలౌట్

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ - 16 మల్టీ డే క్రికెట్ టోర్నీలో భాగంగా వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 76.3 ఓవర్లలో 270 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని హర్ష 88, మొహమ్మద్ షారిక్ 60, నోయల్ 58 (నాట్ అవుట్) పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని నేత్రానంద 4, సుశాంత్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 21.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 70 పరుగులు చేసింది. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 59.2 ఓవర్లలో 210 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఆదినారాయణ రెడ్డి 30, కిరణ్ కుమార్ 31 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని యుహస్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఐదు వికెట్లు తీసుకున్నాడు. వివేక్ రెండు వికెట్లు తీసుకున్నాడు.

ప్రజలకు ఏమి చేశారో చెప్పాలి : వైసిపి

ప్రజాశక్తి - కడప

అన్నీ అమలు చేశాం అని ఈ ప్రభుత్వం చెప్తుంటే ప్రజలు దిగ్భ్రాంతికి గురవుతున్నారు, అసలు ఏమి అమలు చేశారో స్పష్టంగా చెప్పాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సతీష్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సూపర్ 6 పథకాలన్నీ చేశామని టిడిపి వారు అంటున్నారని ఏం అమలు చేశారో చెప్పాలన్నారు. నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, ఫ్రీ బస్సు మీరు ఇచ్చారా..? అని ప్రశ్నించారు. 50 ఏళ్ల దాటిన మహిళకు పెన్షన్ అన్నారని దాని ఊసే లేదని వాపోయారు. లక్ష కోట్లు అన్న లిక్కర్ కేసు చివరికి రూ. 3500 కోట్లకు వచ్చింది అన్నారు. అసలు ఆధారాలు లేకుండా ఒక కట్టు కథ అల్లి కేసులు కట్టారని విమర్శించారు. సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి అంజాద్‌బాష్యా, సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-లింగాల : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ , ఎఎన్ఎంలు అందుబాటులో ఉంటూ ఉన్నాతధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని మండల వైద్యాధికారి ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ఆయన సిబ్బందితో క్షేత్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు సమావేశంలో సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణుల వివరాలు నమోదు చేసి ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు అయ్యేలా చూడాలని చెప్పారు.

ఎస్ఎఫ్ఐ నగర నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా సుమంత్, మోహన

ప్రజాశక్తి - కడప అర్బన్



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఎస్ఎఫ్ఐ నగర నూతన కమిటీని శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఎన్ను కున్నారు. నగర అధ్యక్షులుగా సుమంత్, కార్యదర్శిగా మోహనను ఎన్ను కున్నారు. నగర ఉపాధ్యక్షులుగా అఖిలేష్, శ్రీను, రోహిత్, ఆదిత్య, కార్యదర్శులుగా నవీన్, అద్భుత్, కార్తిక్, నరసింహ నగర కమిటీ సభ్యులుగా మనోహర్, శివ, సాయి, సాగర్, 14 మంది సభ్యులతో నూతన నగర కమిటీ ఎన్నుకున్నారు. సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని నూతన కమిటీకి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన రూ.6400 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 77 ను రద్దు చేసి ప్రయివేట్, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించే విధంగా జీవోను విడుదల చేయాలని కోరారు. విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు పెంచాలని చెప్పారు. తల్లికి వందనం ఎలాంటి షరతులు లేకుండా అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సుమంత్, మోహన్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి నూతన నగర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నుకున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : యువత, విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. రింగ్‌రోడ్డు సర్కిల్‌లోని శ్రీచైతన్య హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడడం వలన ఆరోగ్యంతో పాటు జీవితాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. మన ఇంట్లోకానీ చుట్టు పక్కల వారు కానీ డ్రగ్స్‌కు, సైబర్ నేరాలకు పాల్పడుతుంటే వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యార్థులకు ఉందన్నారు,. వివిధ రకాల సైబర్ నేరగాళ్లు మన ఫోన్లకు పలు రకాల మెసేజ్లతో పాటు పలు యాప్, లింకులను పంపి మన బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బుని లాగేసుకుంటారని చెప్పారు. సోషల్ మీడియాలో చూసి నేరాలు, ఘోరాలు చేస్తున్నారని, టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని ఎవరు చేసిన తప్పించుకునే మార్గం లేదని పేర్కొన్నారు. అందువలన విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలన్నారు. చి విద్యార్థులు టీచర్లు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన గౌస్‌పీర్

ప్రజాశక్తి - కడప అర్బన్



పిసిసి అధ్యక్షులు షర్మిలను కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం కడప నగరంలోని సమస్యల గురించి షర్మిలతో చర్చించారు. ముఖ్యంగా కడప నగరంలోని నీటి సమస్య, పారిశుధ్య కార్మికుల సమస్యలు, కడప బుగ్గ మీద నిర్మించాల్సిన వంతెనల గురించి పలు సమస్యల గురించి వివరించారు. ఈ విషయాలకు షర్మిల సానుకూలంగా స్పందించారని, అలాగే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేయాల్సిన కార్యచరణ గురించి చర్చించి, చేపట్టాల్సిన పనుల గురించి మార్గదర్శకాలు చ్చారని తెలిపారు.



వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎంపి వై.ఎస్.అవినాష్‌రెడ్డి

అధైర్య పడకండి అండగా ఉంటా : ఎంపి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అధైర్య పడకండి అండగా ఉంటానని కడప పార్లమెంట్ సభ్యుడు వై.ఎస్. అవినాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి కార్యకర్తలు, నాయకులు, ప్రజలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందిస్తూ మీ వెంట తాను ఉంటానని భరోసా ఇచ్చారు. సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలిపి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా గండిలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి శ్రావణమాస ఉత్సవాలకు హాజరుకావాలని దేవా లయం చైర్మన్ కృష్ణ తేజ , కమిటీ సభ్యులు, పండితులు ఆయన్ను ఆహ్వానించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

రైతులకు యూరియా దొరకడం లేదు

- మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మందు బాబులకు మద్యం దొరికినంత సులభంగా రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉండడం లేదని మాజీ ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన వైసిపి కార్యాలయంలో మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయని రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండడం లేదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతులకు అవసరమైన ఎరువులను గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు అవసరమైన పచ్చి రొట్టె ఎరువులను పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ పాలన మీద తమ పార్టీ అభిప్రాయాన్ని వెల్లడిస్తే కొంతమంది వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని అవి పట్టించుకోనన్నారు. ఎవరైనా ఏదైనా మాట్లాడితే కక్ష సాధింపు, తప్పుడు కేసులు పెడుతున్నారన్నారని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్ వేలంపాటలో అత్యధిక ధరకు పాడుకొని షాపులు తీసుకుంటే మైదుకూరులో అదిక్కటే రోడ్ల పైకి ఉన్నట్టు కక్ష సాధింపు చర్యలు చేపట్టారన్నారు. అభివృద్ధి, సంక్షేమం లేదని కక్ష సాధింపు మాత్రమే రాజ్యమేలుతోందని చెప్పారు. ప్రభుత్వం సుపరిపాలన అని ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నారని, కొద్ది రోజులు పోతే ప్రజలు నిలేసే రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, కో - ఆప్షన్ మెంబర్ ఎంఆర్ఎఫ్ సుబ్బయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమల కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామంలో ప్రజలకు డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, బోదకాలు వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటిం టా వెళ్లి ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటుకు గురికాకుండా తెరలను వాడాలని, దోమల పెరు గుదలకు అవకాశం ఉన్న నీటి నిల్వలు తొలగించాలని సూచించారు. కార్యక్ర మంలో ఆరోగ్య కార్యకర్తలు మాధవి దేవి, సరస్వతీ, గోపాల్ నాయక్, ఎం.ఎల్. హెచ్ శివ సౌజన్య, ఆశా కార్యకర్తలు భారతి, భాగ్యలక్ష్మి, ప్రజలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ప్రజాశక్తి- ఖాజీపేట

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అప్పనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రెహమాన్ అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో మై భారత్ (నెహ్రూ యువ కేంద్రం) ఆర్థిక సహకారంతో పిఎన్‌ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'అమ్మ పేరు పైన ఒక మొక్క' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ మహా యజ్ఞాన్ని ప్రారంభించారని, కార్యక్రమం ఎంతో గొప్ప కార్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మొక్కలు నాటుతూ ఓవైపు అమ్మకు గౌరవం ఇస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మీకోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పుల్లగూర విష్ణువర్ధన్, పిఎన్‌ఎస్ ఫౌండేషన్ అధ్యక్షులు ఉపేంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టించవచ్చు

ప్రజాశక్తి - ముద్దనూరు

చెత్తతో సంపద సృష్టించవచ్చని ఎంపిడిఒ రాధాకృష్ణవేణి తెలిపారు. స్థానిక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని డిఎన్ పల్లె సమీపంలో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం కార్యదర్శి లక్ష్మి నరసింహులుతో కలిసి పరిశీలించారు.అనంతరం వానపాములను వదిలారు. ఎంపిడిఒ మాట్లాడుతూ రోజూ రోడ్లు శుభ్రం చేసి చెత్త సేకరించాలన్నారు. తడి పొడి చెత్త వేరు చేయాలన్నారు. ప్రతి కాలనీలో ఇంటింటికి తిరిగి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ,పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

దిగజారుడు ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

రైతులు, వ్యాపారుల విషయంలో వైసిపి నాయకులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప రాజకీయాలు చేయవద్దు అని, రాజకీయాల కోసం వైసిపి దిగజారుడు ఆరోపణలు మానుకుంటే మంచిదని పులివెందుల టిడిపి మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పులివెందుల మార్కెట్ యార్డ్‌లో దళారులు ఉన్నారని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ఆరోపించడం తగదన్నారు. గతంలో పులివెందులలో అరటి ధరలు ఎందుకు పడిపోయాయో అందరికీ తెలుసు అన్నారు. కూటమి ప్రభుత్వంలో అరటి ధర 32 వేల వరకు పలికిందన్నారు. చేతనైతే పులివెందుల మార్కెట్ అభివృద్ధి సహకరించాలని, కూటమి ప్రభుత్వం మీద నాయకుల మీద బురద చల్లడం మానుకోవాలని హితవు పలికారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

ఈనెల 27న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎపి ఎన్‌జిఒ తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు రఘురామిరెడ్డి, రామసుబ్బయ్య శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్జీవో భవన ప్రాంగణంలో ప్రముఖ హోలిస్టిక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి 12.30 గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. బి.పి, షుగర్, ఇసిజి, వైద్యుల సలహా మేరకు టు డి ఎకో, బిఎంఐ, ఉచిత ఆరోగ్య చిట్కాలు, గుండె సమస్యలపై అవగాహన, షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్‌తో కన్సల్టేషన్, ప్రముఖ గుండె వైద్య నిపుణుల కన్సల్టేషన్, ఎముకల, నరముల స్పెషలిస్ట్ డాక్టర్ కన్సల్టేషన్ ఉంటుందన్నారు. కచ్చితమైన షుగర్ స్థాయి కోసం ఉపవాసంతో రావాలని అన్నారు. ఇహెచ్‌ఎస్, ఎన్‌టిఆర్ ఆరోగ్య కార్డులు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పులివెందుల మార్కెట్ యార్డులో ఇ-నామ్ : కలెక్టర్

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

రైతులు తాము పండించిన ఉత్పత్తులను మరింత మెరుగైన ధరలకు విక్రయించేందుకు ఇ-నామ్ (జాతీయ వ్యవసాయ మార్కెట్) వ్యవస్థను ఈనెలలో పులివెందుల మార్కెట్ యార్డులో తీసుకొస్తామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా పులివెందుల చీని మార్కెట్ యార్డ్ ను ఆకస్మిక తనిఖీ చేసి ఇ - పంటకు అందుతున్న ధరలు, మార్కెట్‌లో ఎదుర్కొంటున్న సమస్యలు, సంబంధిత అంశాలపై చీనీ రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించే చీని పంట సంవత్సరంలో రెండు దపాలు మాత్రమే చేతికి అందుతుందని, అలాంటి పంటకు సరైన ధర అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రైతులు పండించే పంటకు గ్రేడింగ్ చేసేందుకు సమావేశాలు నిర్వహించి వారిని సంఘటితం చేసి ఎఫ్‌ఇఒలను ఏర్పాటు చేయాలన్నారు. పులివెందుల మార్కెట్ యార్డ్‌లో ఇప్పటివరకు గ్రేడింగ్ చేయకపోవడం, ఇతర జిల్లాలలో, ఇతర రాష్ట్రాలలో చీని పంట ధరలను ప్రదర్శించక పోవడం, కంప్యూటరైజ్ చేయక పోవడం, సంబంధిత అంశాలకు సంబంధించి మార్కెట్ అధికారులపై జిల్లా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. హమాలీలకు ఎంత ఖర్చవుతుంది? రైతులకు నగదును ఆన్లైన్ ద్వారా, క్యాష్ రూపంలో అందిస్తున్నారా? పారదర్శకత రాకపోతే బయట నుండి ట్రేడర్లు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. కమిషన్ ఏజెంట్లు నియమ నిబంధనలకు లోబడి పని చేయాలే కానీ సొంత వ్యాపారం అనుకొని చేస్తే సహించేది లేదు అన్నారు. మార్కెటింగ్ శాఖకు సంబంధించి సెక్రటరీ ఏం పని చేస్తున్నాడు? పనిచేయకపోతే జీతం కట్ చేస్తాం అని హెచ్చరించారు. ఎవరి పని వారు బాధ్యతగా నిర్వర్తించాలి అన్నారు. అనంతరం పులివెందుల మార్కెట్ యార్డ్‌లో ఈనెల నుంచి ఇ- నామ్ వ్యవస్థను తీసుకొని వచ్చి ఆన్లైన్ ద్వారా వ్యాపారం జరిగేలా , ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలలో చీనీ పంట ధరలను డిజిటల్ సైన్ బోర్డుల ద్వారా ప్రదర్శించేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వంద శాతం గ్రేడింగ్ చేయడం ద్వారా నాణ్యమైన పంటకు మెరుగైన ధర అందేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయనన్నారు. ఆయన వెంట మార్కెటింగ్ శాఖ జెడి రామాంజనేయులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు, పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య, మార్కెటింగ్ శాఖ డిడి లావణ్య, ఏడీ ఆజాద్ సంబంధితశాఖల అధికారులు, రైతులు, కమిషన్ ఏజెంట్లు పాల్గొన్నారు.



చీనీ కాయల నాణ్యత చూస్తున్న కలెక్టర్

రక్తదానం గొప్ప సామాజిక సేవ : డిఆర్‌ఒ



రక్తనం చేస్తున్న వ్యక్తిని అభినందిస్తున్న డిఆర్‌ఒ

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

రక్తదానం గొప్ప సామాజిక సేవ అని డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు అన్నారు. ప్రొద్దుటూరు స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్త వారోత్సవాలు 2025 రెండవ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఆర్‌ఒ మాట్లాడుతూ సమాజ బాధ్యతగా యువకులు రక్తదానాన్ని తీసుకొని నిర్వహించడం మంచి పరిణామం అన్నారు. రక్తదానం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరినో కాపాడవచ్చు అని దీనివల్ల ప్రతి ఒక్కరికి ఎంతో మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. డిప్యూటీ తహశీల్దార్ అజయ్ బాబు, ఎన్ఆర్ యూనివర్సిటీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని రక్తాన్ని రక్తదానం వల్ల మాత్రమే ఇతరులకు ఉపకారం చేయవచ్చని అన్నారు .ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్త దానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్, బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 71 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని కార్యక్రమాన్ని నిర్వహించిన స్వచ్ఛంద సంస్థలకు అభినందనలు తెలిపారు. మహిళలు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. శ్రీశ్రీ హెూలీ స్టిక్ హాస్పిటల్ డాక్టర్ నాగ శేఖర్ రెడ్డి బిపి ,డయాబెటిక్ పరీక్షలు నిర్వహించారు. కార్య్ర కమంలో వికసిత ఫౌండేషన్ శూలం లక్ష్మీదేవి, ఆదరణ స్వచ్ఛంద సంస్థ సత్యనారాయణ, సంస్కృతి సేవా సంస్థ వంటేరు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ దిలీప్, శ్రీశ్రీ హెూలీ స్టిక్ జనరల్ మేనేజర్ నరసింహ, విద్యార్థి ఫౌండేషన్ నిర్వాహకులు విజయభాస్కర్ రెడ్డి, వేములపాటి సూర్యనారాయణ రెడ్డి, ప్రాణదాత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రాజు, రవీంద్ర, ఆర్నాల్డ్ జిమ్ న్యామతుల్లా ,డాక్టర్ మురుకుటి సూర్యనారాయణ రెడ్డి, ఫ్రెండ్స్ ఫౌండేషన్ నిర్వాహకులు ఫ్రెండ్స్ వుమర్, డివైఎఫ్ఐ విశ్వనాథ్, మదర్ తెరెసా సేవా సంస్థ రాజేష్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, అమృత పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత : ఎడిఎ

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని వ్యవసాయ శాఖ మైదుకూరు డివిజన్ ఎడిఎ కృష్ణమూర్తి తెలిపారు. డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయి సిబ్బంది ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆదిరెడ్డి పల్లె యూనిట్ పరిధిలో ఓబయ్య పొలం నందు ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, విత్తన గుళికలు తయారుచేసి వాటి ఉపయోగాలను సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎఒ బాలగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమిలో సేంద్రియ కర్బనం అధికంగా పెరుగుతుందన్నారు. భూమిలో ఉపయోగకరమైన సూక్ష్మజీవులు పెరుగుతాయని, సారవంతమైన నేలను తరువాతి తరాలకు అందించవచ్చని చెప్పారు. రసాయనిక ఎరువుల వినియోగం వలన కలిగే నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంటి కృష్ణారెడ్డి, చెన్నయ్య ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డివిజన్ పరిధిలోని రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. **చాపాడు:** మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మైదుకూరు డివిజన్ ఎడిఎ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చియ్యపాడు రైతు సేవా కేంద్రంలో దస్తగిరి స్వామి రైతు మిత్ర గ్రూపుకు 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వం మంజూరు చేసిన డ్రోన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయానికి వివిధ రకాల సబ్సిడీ పథకాలు అందిస్తుందన్నారు. అందులో భాగంగా రూ. 9.8 లక్షలు విలువ చేసే డ్రోన్ 80 శాతం సబ్సిడీతో లబ్ధిదారులకు అందిస్తుందిన్నారు. యాంత్రికరణలో భాగంగా ఇలాంటి పరికరాలు వ్యవసాయానికి దోహద పడతాయన్నారు. డ్రోన్ ద్వారా తక్కువ సమయంలోనే ఎక్కువ ఎకరా లలోని పంటలకు మందు పిచికారి చేయవచ్చున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలత, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రమణ, ఏఈఓ స్వప్న, కంపెనీ సిబ్బంది వంశీ, మీరా, రైతులు పాల్గొన్నారు. **లింగాల :** రసాయనిక ఎరువులతో పండించిన పంటలను ఆహారంగా తీసుకుంటే అనారోగ్యపాలు అయ్యే అవకాశం ఉందని ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చున్ని పులివెందుల డివిజన్ వ్యవసాయాధికారి ప్రభాకరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అక్కులగారిపల్లి ఉత్తమ ప్రకృతి వ్యవసాయ యువరైతు నరాల ఉదయ్ కృష్ణారెడ్డి ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం ఆయన పర్యటించారు. పలు విషయాలు రైతులను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆయన ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకెళ్లేందుకు వ్యవసాయశాఖ సిబ్బంది, రైతు సేవా సిబ్బంది ఎఇఒ, ఎంపిఇఒలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్, పులివెందుల, ఎఒ చెన్నారెడ్డి, వేముల ఎఒ ఓబులేసు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గండిక్షేత్రంలో శ్రావణమాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో శనివారం శ్రావణమాసం ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో గండి క్షేత్రానికి వచ్చే యాత్రికులకు అన్ని ఏర్పాట్లు చేయాలనే ఉద్దేశంతో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేంపల్లి టిడిపి మండల కన్వీనర్ మునిరెడ్డి మాట్లాడుతూ చక్రాయపేట, వేంపల్లి మండలాల నుండి కల్లూరు వెంకటస్వామి, సింగం గణపతి రెడ్డి, జి వెంకట శివ, నల్ల మేకల రామస్వామి, వర్తి నిహారిక, కె రామచంద్రారెడ్డి, ఎద్దుల రామ తులసి, బి జయలక్ష్మి దేవి, కె నారాయణ రెడ్డి, చలపతి నాగమల్లయ్య లను ఉత్సవ కమిటీ సభ్యులుగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రికి, మంత్రి లోకేష్‌కు, బిటెక్ రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డక్క రమేష్, షేక్ మొ హమ్మద్, టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమస్యలుంటే టోల్ ఫ్రీని సంప్రదించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



సూచనలు ఇస్తున్న కానిస్టేబుల్ సురేష్

గండికోటలో సమస్యలు ఏమైనా ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 100, 112 కు ఫోన్ చేయాలని కానిస్టేబుల్ సురేష్ పర్యాటకులకు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం ఉత్తం ప్రదేశ్ నుంచి ఓ పర్యాట కురాలు ఒంటరిగా రావడం వల్ల తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ సురేష్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సౌమ్య తివారి ఇన్‌స్టాగ్రామ్ లో రీల్స్ చేయడానికి గండికోటకు వచ్చారని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని స్థానిక డిఎస్‌పి, సిఐల ఆదేశాల మేరకు పర్యాటకులకు తగు సూచనలు ఇస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే ఆమె వివరాలను సేకరించి టోల్ ఫ్రీ నెంబర్లు ఇచ్చామన్నారు. ఆమె ఆటో డ్రైవర్‌తో ఒంటరిగా రావడంతో డ్రైవర్ కు కూడా జాగ్రత్తగా తీసుకెళ్ళమని చెప్పామన్నారు. ఆయనతోపాటు కానిస్టేబుళ్ల సుధీర్, రామాంజనేయులు ఉన్నారు.

'మెట్రో'కు వంద శాతం నిధులు కేంద్రమే భరించాలి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

విభజన చట్టం 13వ షెడ్యూల్ ప్రకారం విశాఖ, విజయవాడ మెట్రో రైలు సౌకర్యానికి కేంద్ర ప్రభుత్వమే వంద శాతం నిధులతో ఏర్పాటు చేయాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెట్రో రైలు ఏర్పాటుపై 10 సంవత్సరాలు పైబడినా కేంద్రంలోని మోడీప్రభుత్వం పట్టించుకోక పోవడం గర్హనీయం అన్నారు. 50 శాతం నిధులతో కేంద్ర ప్రభుత్వం, 50 శాతం నిధులతో రాష్ట్రం భరించేటట్లు టెండర్లు పిలవాలని మంత్రి మండలి నిర్ణయించడం శోచనీయం అన్నారు. రాష్ట్ర ఖజానాపై విపరీతమైన ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. మొదటి దశకే రాష్ట్రంపై రూ 10,808 కోట్ల భారం పడడంతో ఇప్పటికే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకు పోయినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రం శాశ్వతంగా అప్పుల ఊబిలోకి పోతుందని చెప్పారు. డబుల్ ఇంజన్ సర్కార్ ట్రబుల్ ఇంజన్ సర్కార్‌గా మారడం శోచనీయం అన్నారు. వంద శాతం కేంద్ర నిధులతో ఏర్పాటు చేసేటట్లు మోడీ ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉండడం శోచనీయం అన్నారు. ఈ ఖరీఫ్‌కు గాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి1,30,000 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని కాని ఇప్పటివరకూ కేవలం 49,485 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని తెలిపారు. ఇంకా 80,515 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందని కాబట్టి వెంటనే 80515 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత 6 క్వార్టర్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం కళాశాలకు విడుదల చేయలేదని విమర్శించారు. 2024 మొదటి క్వార్టర్ నుండి బకాయిలు ఉన్నట్లు చెప్పారు. రూ 6400 కోట్ల బకాయిలు ఉండడంతో కళాశాలల యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, కరెంటు బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. సర్టిఫికెట్లు ఇవ్వ కుండా విద్యార్థుల మీద ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఇటు విద్యార్థులు పై చదువులకు అటు ఉద్యోగాలకు పోలేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వెంటనే రూ 6400 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం విడుదల చేయా లని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు పది వారాలుగా కూలి డబ్బులు అందలేదని కాబట్టి వెంటనే ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం వెంటనే డబ్బులు విడుదల చేయాలని కోరారు. సెంట్రల్ లైజుడు కిచెన్ ఏర్పాటు చేయడం వల్ల మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులు ఉపాధి కోల్పోతారని చెప్పారు. ప్రభుత్వం సెంట్రల్ లైజుడు కిచెన్ ఏర్పాటుపై ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



జెసిబి సాయంతో కాల్వలో పూడిక తీయిస్తున్న నాయకులు

కెసి కాలువలో పూడికతీత పనులు

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్ర మైన చాపాడులోని కెసి ఉపకాలువలో పూడికతీత పనులను శుక్రవారం చేపట్టారు. టిడిపి నాయకులు అక్బర్‌వల్లి ఆధ్వర్యంలో పంట పొలాలకు వెళ్లే చాపాడు-1 కాలువ పూర్తిగా పూడికతో నిండిపోయి చాలా అధ్వానంగా ఉంది. పంట కాలువలో నీరు ప్రవ హించడం కష్టతరంగా ఉండేది. ఈ విషయాన్ని కెసి కెనాల్ అధికారులకు రైతులు విన్నవించడంతో చాపాడు ఛానల్ ఎఇ గురుమోహన్‌రెడ్డి స్పందించి పూడికతీత పనులు చేయించారు. చాపాడు ఛానల్ చివరి ఆయికట్టుకు నీరు చేరడం సులభతరం అవుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబు, టిడిపి పార్లమెంట్ కార్యదర్శి సలీం, టిడిపి నాయకులు మస్తాన్, రవి, వినోద్ ,రైతులు పాల్గొన్నారు.

విజయవాడ కమిషనరేట్ ఎస్‌బి ఎసిపిగా వేంపల్లె వాసి

ప్రజాశక్తి - వేంపల్లె



బాధ్యతలు స్వీకరిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి (ఫైల్)

విజయవాడ కమిషనరెట్‌లో ఎస్‌బి ఎసిపిగా వేంపల్లెకు చెందిన నర్రెడ్డి భాను ప్రకాష్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. దీంతో వేంపల్లె, వీరపునాయునిపల్లె గ్రామాల కు చెందిన పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీరపు నాయుని పల్లె మండలం గోను మాకుల పల్లెకు చెందిన నర్రెడ్డి గంగధర్ రెడ్డి, అమరావతి (టిచర్) దంపతుల కుమారుడైన నర్రెడ్డి భాను ప్రకాష్ రెడ్డి 2018 బ్యాచ్ లో గ్రూపు - 1 కు సెలెక్ట్ అయ్యారు. వేంపల్లెలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 6, 7 తరగతుల చదవగా 8 నుండి 10 వ తరగతి వరకు శ్రీ చైతన్య పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం ఇంటర్ తిరుపతిలోని శ్రీ చైతన్య కళాశాలలో చదివి తంజావూరులో బిటెక్ పూర్తి చేశారు. చదువు పూర్తి అయిన తర్వాత ఆయా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగిగా పని చేస్తూనే గ్రూపు -1 కు పిపేర్ అయ్యారు. 2018 లో గ్రూపు - 1లో మొదటి స్థానంలో సెలక్ట్ కావడంతో గ్రౌహండ్స్ డిఎస్‌పిగా బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల విజయ వాడ కమిషనరెట్ లో స్పెషల్ బ్రాంచ్ ఎసిపిగా బాధ్యతలు స్వీకరించారు. వేం పల్లెకు చెందిన వ్యక్తి ఎసిపిగా బాధ్యతలు స్వీకరించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

నిర్మాణాత్మక విమర్శలు చేస్తే బాగుంటుంది

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాజీ శాసనమండలి సభ్యులు సతీష్ రెడ్డి ప్రభుత్వం పై నిర్మాణాత్మక విమర్శలు చేస్తే బాగుంటుందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి సంయుక్తంగా హితవు పలికారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం సుపరిపాలనపై పట్టణంలోని వార్డులలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పనితీరును పరిశీలించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో వై.ఎస్. కుటుంబంతో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న వ్యక్తి, నాయకులు ఇప్పుడు జగన్ సమక్షంలో చేరి అన్నం పెట్టిన, పదవులు ఇచ్చిన తెలుగుదేశం పార్టీ నే వ్యక్తిగతంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. ప్రతిపక్ష పాత్రలో ప్రభుత్వానికి సూచనలు ఇస్తే వాటిని స్వీకరిస్తామన్నారు. వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం వెంకటరమణారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు, దేవగుడి యూత్ నాగేశ్వర్ రెడ్డి, తుమ్మలూరు బ్రదర్స్, బిర్రు సంతోష్, రాజేష్, దువ్వూరు బ్రదర్ మురళి పాల్గొన్నారు.

అబద్ధాలతోనే అధికారంలోకి వచ్చారు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సిఎం చంద్రబాబు నాయుడు అబద్ధాలతోనే అధికారంలోకి వచ్చారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొర్రపాడు రోడ్డులోని టిఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన 'బాబు షూర్యిటీ మోసం గ్యారెంటీ' మండల స్థాయి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో పాటు మరిన్ని హామీలు ప్రజలకు ఇచ్చి గద్దెనెక్కారన్నారు. వాటితో జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలకు తెలపాలని సూచించారు.13 నెలల పాలనలో చంద్రబాబు సూపర్ సిక్స్ అమలులో విఫలమయ్యారన్నారు. ఫించన్ల పెంపు ,తల్లికి వందనం, 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అరకొరగా అందించడం తప్పా అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, మహాశక్తి, 50 ఏండ్లు నిండిన వారికి పింఛన్లు, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం జిల్లా పరిధి13 నెలల్లో కొత్త పెన్షన్లను మంజూరు ఊసే లేదని విమర్శించారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం జిల్లా పరిధి వరకు పరిమితం చేశారని విమర్శించారు. తాను తన ఎమ్మెల్యే ఎన్నికల కన్నా స్థానిక సంస్థల ఎన్నికలే ప్రతిష్టాత్మకంగా తీసుకున్నానని, చెప్పారు. భవిష్యత్తులో అధికారం తమదే అని, తాను మంత్రి అవుతానని జోష్యం చెప్పారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కల్లూరు నాగేంద్ర రెడ్డి, ఎంపిపి శేఖర్ యాదవ్,ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADAPA

I.A.No. 405/2020

O.S.No. 795/2020

Dudekula Beebi, W/o Mahaboob Sab, D.No.1/1397, Pusala Veedhi, Yarrmukkapalli, Kadapa City. **...Petitioner/Plaintiff**

Vs

Darja Vijaya Kumar, Now Residing at D.No.1/1398, Pusala Veedhi, Yerramukkapalli, Kadapa City. **...Respondent No.2/Defendant No.2**

నోటీసు

పై నెంబరులో పిటిషనరు(వాది) ఇంజక్షన్ కోరుచు పిటిషన్ దాఖలు చేసినది. మీ నోటీసుకు గాను 5.8.2025 వ తేదీన వాయిదా వున్నది. 2వ రెస్పాండెంటు అయిన మీకు ఆక్షేపణలున్న ఎడలపై కోర్టులో ఉదయం గం.10.30లకు హాజరయి తెలుపుకొనవచ్చును. లేనంతట పరోక్షములో ఎక్సపార్టీగా తీర్మానించబడును.

పి.వి.సుధాకర్
పిటిషనరు అడ్వకేటు
కడప.

ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.No. 38/2025

ఈడిగ రవికుమార్ గౌడ్, S/o శివయ్య, వయస్సు 62 సం॥రాలు, డోర్ నెం.23/123, నాగేంద్ర నగర్, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. **...పిటీషనరు**

Vs

1. కోటి రెడ్డి, వయస్సు 70 సం॥రాలు, R/o పాలిటెక్నిక్ కాలేజ్ బాక్ సైడ్, నియర్ సరస్వతి విద్యామందిర్ స్కూల్, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.

మరియు ఇతరులు. **...రెస్పాండెంట్స్**

నోటీస్

పై నెంబరులోని ఈడిగ రవికుమార్ గౌడ్, పై కోర్టు యందు రెస్పాండెంట్స్ అయిన మీ పైన 9914964/- రూపాయలను అప్పుగా చూపించి తనకు రావలసిన లీవ్ శాలరీ మొత్తాన్ని, (2200000/- రూపాయలు) రెస్పాండెంట్స్ అయిన మీరు తీసుకొని లాగునా I.P.ని దాఖలు చేసి ఉన్నాడు. అట్టి I.P. యందు మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయడల 09.09.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరయ్యి తెలుపుకోవలయును. లేనంతట పరోక్షముగా తీర్మాణించబడును.

వాయిదా తేది: 09.09.2025

T. PADMAJA, M.Com.,LLM.,
Advocate, PRODDATUR